


రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని తుమ్మలూరు అర్బన్ ఫారెస్ట్‌లో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో మంత్రులు సబిత, ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీలు సంతోష్‌కుమార్, రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కాలె యాదయ్య, జైపాల్‌యాదవ్, అంజయ్యయాదవ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి తదితరులు.. భారీగా హాజరైన ప్రజలు

# వంద కోట్లతో ఉచితంగా పండ్ల మొక్కలు

**ఈ ఏడాది నుంచే రాష్ట్రమంతా పంపిణీ చేస్తాం • హరితహారం అంటే నవ్వులాట అనుకున్నరు**

**అయ్యేదా, పొయ్యేదా అని కాంగ్రెసోళ్లు జోకులేసిన్రు • ఇప్పుడు హరిత రాష్ట్రంగా తెలంగాణ**

**తెలంగాణ పచ్చదనానికి దేశవ్యాప్త ప్రశంసలు • తుమ్మలూరు హరితోత్సవంలో సీఎం కేసీఆర్**

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూన్ 19 (నమస్తే తెలంగాణ): తెలంగాణ కొద్ది గంత పచ్చవడ్డదని, ఏడెనిమిదేండ్ల నుంచి అందరం పట్టుబట్టి, జట్టు కట్టి నీరుగారిన, బీడు వారిన తెలంగాణను తోవకు తెచ్చుకున్నమని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సోమవారం రంగా రెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని తుమ్మలూరులో నిర్వహించిన హరితోత్సవంలో సీఎం కేసీఆర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మాట్లాడుతూ.. ఈ ఏడాది నుంచి ప్రజలకు అవసరమైన పండ్ల మొక్కలను ప్రభుత్వమే ఉచితంగా పంపిణీ చేస్తుందని తెలిపారు. వంద కోట్ల బడ్జెట్ అయినా ఈ ప్రక్రియ చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి చెప్పానని, సర్పంచులకు ఇస్తే వాళ్లే పండ్ల మొక్కలు పంచి పెడతారని సూచించానని వివరించారు. వడ్లు పండించడంలో 2014లో తెలంగాణ 16, 17వ స్థానంలో ఉండేది. ఇప్పుడు దేశంలో నంబర్ వన్‌గా ఉన్నదని పత్రికల్లో వార్తలు చూసి చాలా సంతోషం కలిగింది. ఎక్కువ వడ్లు పండించటం అంటే పచ్చని పంటలు ఉంటనే సాధ్యం అయితదన్నారు.

### అయ్యేదా... పోయ్యేదా.. అన్నరు

తెలంగాణలో హరితహారం ప్రారంభించినపుడు కాంగ్రెస్ వాళ్లు ఇదొక జోక్‌లేశారని సీఎం కేసీఆర్ గుర్తుచేశారు. 'అయ్యేదా.. పొయ్యేదా.. అన్నరు. కానీ, ఇప్పుడు రాష్ట్రంలో ఎక్కడ చూసినా పచ్చదనం ఉట్టిపడుతున్నది. ఇందిరా పార్కులో ఆక్సిజన్ అమ్ముతామని ఒకాయన ఆక్సిజన్ మిషన్ పెట్టిండు. మనకు భూములు లేవా? అడవులు లేవా? చెట్లు లేవా? విస్తృతంగా చెట్లు పెడితే అపారంగా ఆక్సిజన్ లభిస్తుంది. ఇంత వనరులు ఉన్న దేశంలో భయంకరంగా అడవులను నాశనం చేసి, మోడువారిన, బీడువారిన ప్రాంతంగా తయారు చేసినారు. నేను సీఎం అయిన తర్వా త మొదటి వారంలో అటవీ శాఖ బిల్లు పెట్టుకున్నం. 'వానలు వాపసు రావాలె, కోతులు వాపసు పోవాలె' అని పాట కూడా రాసిన. పచ్చని అడవి ఉంటే కోతులు ఊర్లళ్లకు రావు. అందుకే బ్రహ్మాండంగా చెట్లు పెట్టుకోవాలని హరితహారం చేపట్టినం. హరితహారం అని చెబితే ఎవరికీ అర్థం కాలేదు. చాలా మంది ఇదే దో నవ్వులాట అనుకున్నరు, కేసీఆర్‌కు ఏం పని లేదా? అన్నరు. ఇదేదో అయ్యేదా, పొయ్యేదా అన్నరు. కొంతమంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో జోకులేశారు. కానీ, కేసీఆర్ ప్రారంభించిన హరితహారం ఫలాలు తుమ్మలూరులో కనిపిస్తున్నయి. అటవీశాఖ వాళ్లు సఫారీలో అంతా తిప్పి చూపించారు. మూడు, నాలుగేండ్ల కింద ఇక్కడ పెట్టిన మొక్కలు బ్రహ్మాండగా పెరిగి పెద్దగై కనిపిస్తున్నయ్. ఈ రోజు దాదాపు 250 ఎకరాల వరకు ప్లాంటేషన్ చేశారు. ఇట్లనే అడవులు ఎక్కడ నాశనమైపోయినవో వాటికి పునరుజ్జీవనం కల్పించాలి' అని అన్నారు.

### సర్పంచులందరూ అభినందనీయులు

తొమ్మిదేండ్లలో తెలంగాణలో 7.7 శాతం పచ్చదనం పెరిగిందని, ఇదేదో మాటలు చెబితే, తమాషాలు, కథలు చెబితే సాధ్యం కాదని సీఎం అన్నారు. ఈ హరిత యజ్ఞంలో ఎలాగూ అటవీశాఖ యంత్రాంగం అభినందనీయులని, అందరి కంటే ఎక్కువగా గ్రామ సర్పంచులు అని అన్నారు. తాను గతంలో చట్టం తెచ్చినపుడు వాళ్లకు కూడా కొంత కోపం వచ్చిందని, కానీ ఈ రోజు గ్రామాలు ఎంతో అద్భుతంగా, పచ్చగా ఉన్నాయని చెప్పారు. 'ఇంతకు ముందున్న సర్పంచులకు హరిత కీర్తి దక్కలేదు. గ్రామాలను పచ్చగ చేసిన కీర్తి ఇప్పుడున్న సర్పంచులకే దక్కింది. దాన్ని మీరు కొనసాగించాలి. అదనపు డబ్బు లు కావాలంటే ఏర్పాటు చేద్దాం గానీ హరితహారాన్ని పట్టువదలకుండా చేస్తే రాష్ట్రం పచ్చగ ఉంటది. మనందరికీ ఆహ్లాదకరంగా ఉంటుంది. ఎంత ఆస్తి ఉన్నా, ఎంత పెరిగినా పచ్చదనం లేకపోతే వాతావరణం అనుకూలంగా లేకపోతే ఏం చేయలేం. ఆస్తి ఉన్న వ్యక్తి ని ఎడారిలో విడిచిపెడితే ఏం చేస్తడు? ఎన్ని బంగ్లాలు ఉన్నా పనికి రావు. బతకడానికి అనుకూలమైన పర్యావరణ పరిస్థితులను నిర్మించడం కూడా మన తరం బాధ్యత. ఈ పట్టుదల చెడిపోకుండా ముందుకుపోవాలి' అని ఆకాంక్షించారు.

### అటవీ శాఖ పునర్వ్యవస్థీకరణకు చర్యలు

> అటవీ శాఖ వాళ్లు మన కోసం చాలా కష్టపడి పని చేస్తున్నారని సీఎం కేసీఆర్ ప్రశంసించారు. ఒక దుర్మార్గుడు ఒక ఫారెస్టు అధికారిని దారుణంగా చంపాడని, ఇప్పుడే ఆ అధికారి భార్యకు ఉద్యోగ (డిప్యూటీ తహసీల్దార్) నియామక పత్రాన్ని ఇచ్చినట్టు చెప్పారు. ఆర్థికంగా కూడా ఆదుకున్నామని తెలిపారు. అటవీ శాఖ అధికారులు, సిబ్బందిపై దాడులు జరగకుండా ఉండేందుకు కొన్ని పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేసుకొని, అవసరమైతే సాయుధ సహాయం కూడా తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని, ఈ మేరకు వాళ్ల రక్షణ కోసం హామీ ఇస్తున్నట్టు సీఎం ప్రకటించారు. 25 పోలీస్ స్టేషన్లు అవసరమని చెప్పారని, ఆ ప్రతిపాదనలు ఇస్తే వెంటనే మంజూరు చేస్తామని వెల్లడించారు. ఎలాగూ ప్రధాన కార్యదర్శి అటవీ శాఖ ముఖ్య కార్యదర్శిగా ఉన్నందున శాఖ పునర్వ్యవస్థీకరణకు చేపట్టాల్సిన చర్యలను కచ్చితంగా తీసుకుందామని భరోసా ఇచ్చారు.

### ఇతర రాష్ట్రాలకు ఆదర్శం

తెలంగాణలో చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకొంటున్నాయి. 2015 నుంచి చేపట్టిన హరితహారం నేటివరకు యజ్ఞంలా సాగుతున్నది. రాష్ట్రం పచ్చని పల్లెలతో స్వాగతం పలుకుతున్నది.

**- అటవీ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి**

### చరిత్రలో మైలురాయి

దశాబ్ది ఉత్సవాలు దేశ చరిత్రలో మైలురాయిగా నిలుస్తాయి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించేందుకు ఉపయోగపడుతున్నాయి. కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రం అన్ని రంగాల్లో దూసుకుపోతున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని ప్రజలు మరోసారి ఆదరించి ఆశీర్వదించాలి.

**-విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

### పునరంకితమవుదాం

సీఎం కేసీఆర్ పచ్చదనాన్ని ప్రాధాన్య అంశంగా తీసుకుని హరితహారానికి రూపకల్పన చేశారు. స్వయంగా సీఎం పర్యవేక్షిస్తుండటంతో ఎటుచూసినా పచ్చదనమే కనిపిస్తున్నది. ఇప్పటికే 273.33 కోట్ల మొక్కలను నాటాం. ఈ ఏడాది 19 కోట్ల మొక్కలను నాటాలని లక్ష్యం పెట్టుకొని 30.29 కోట్ల మొక్కలను నర్సరీల్లో అందుబాటులో ఉంచాం. సీఎం హరితహార లక్ష్య సాధనలో ప్రభుత్వ ఉద్యోగులందరం మరోసారి పునరంకింతం అవుదాం.

**-సీఎస్ శాంతికుమారి**

### సీఎం పర్యటన సాగిందిలా..

'తెలంగాణ హరితోత్సవం'లో సోమవారం సీఎం కేసీఆర్ పాల్గొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు తుమ్మలూరు అర్బన్ ఫారెస్ట్ పార్కు వద్దకు చేరుకున్నారు. అక్కడ విద్యార్థులతో కలిసి మొక్కలు నాటిన కేసీఆర్.. కొద్దిసేపు ప్రత్యేక వాహనంలో ప్రయాణించి అటవీ ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులను పరిశీలించారు. ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. మొక్కల సంరక్షణకు సంబంధించిన అంశాలను మంత్రి అల్లోల్ల ఇంద్రకరణ్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, సీఎం కార్యదర్శి భూపాల్‌రెడ్డి, సీఎంవో ఓఎస్డీ ప్రియాంక వర్గీస్, పీసీసీఎఫ్ డోబ్రియాల్ సీఎంకు వివరించారు. అనంతరం మహాగని రకానికి చెందిన మొక్కను మంత్రులు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, ఎమ్మెల్యేలతో కలిసి నాటారు.

### తెలంగాణ పచ్చదనానికి దేశవ్యాప్త ప్రశంసలు

**రాష్ట్రంలో** పెరిగిన పచ్చదనాన్ని చూసి దేశవ్యాప్తంగా ప్రశంసలు వస్తున్నాయని సీఎం కేసీఆర్ అన్నారు. అందుకే తెలంగాణ అంటేనే హరిత రాష్ట్రంగా పేరొచ్చిందని తెలిపారు. 'పంజాబ్, ముంబై, ఢిల్లీ, డ్రైవర్లు చెబుతున్నరు.. తెలంగాణ కహ్ తక్ రహ్‌తా బై.. అంటే అచ్చా పేడ్ లగ్‌తే.. ఝాడ్ రహ్‌తా వహా తక్ తెలంగాణ హై. ఝాడ్ ఖతం హోతా వహా తెలంగాణ ఖతం హోతా (తెలంగాణ ఎక్కడిదాకా ఉన్నదంటే మంచి చెట్లు ఎక్కడి వరకు ఉంటయో అక్కడి వరకు. పచ్చదనం ఎక్కడ ఆగిపోతుందో అక్కడ తెలంగాణ సరిహద్దు ముగిసినట్టు) ఆ పేరును ఇంకా పెంచుకోవాలి. నా ఆఫీసులో ఇద్దరు కార్యదర్శులు భూపాల్‌రెడ్డి, ప్రియాంక వర్గీస్ హరిత సైనికుల్లా ఉండి, ఎవరు పీసీసీఎఫ్ ఉన్నా, వాళ్లకు నాకు, ప్రధాన కార్యదర్శికి సమన్వయం చేసి ఎప్పటికప్పుడు నిధులు ఇప్పించి అద్భుతమైన కృషి చేశారు. తెలంగాణలో ఎక్కడ చూసినా దారులు, రిజర్వు ఫారెస్టులు బ్రహ్మాండంగా ఉన్నయి' అని సంతోషం వ్యక్తం చేశారు.

### సమిష్టి కృషితోనే హరిత తెలంగాణ

> పచ్చదనం పెంచే ప్రయత్నంలో ప్రపంచంలోని రెండు దేశాలు బాగా చేశాయని సీఎం కేసీఆర్ అన్నారు. 'చైనాలో గోబి అనే ఎడారి ఉన్నది. అది ఏటా కొన్ని వందల మైళ్లు ఇసుకతోటి భూమిని కప్పేస్తుంది. ఆ ఎడారి విస్తరిస్తే మన బతుకులు నాశనమైపోతయని చైనా ఒక ప్రతిజ్ఞ తీసుకున్నది. పట్టుబట్టి, మొండిగా 500 కోట్ల మొక్కలు నాటినరు. పచ్చదనం తగ్గిపోతుందని గుర్తించి యుద్ధం చేసిన మరో దేశం బ్రెజిల్. వాళ్లు సుమారు 300 కోట్ల మొక్కలు నాటినారు. తెలంగాణలో కూడా ఇప్పటికే 276 కోట్ల మొక్కలు నాటినం. అందుకే ఎక్కడ చూసినా పచ్చదనం కనిపిస్తున్నది. ఎంత అడ్వాన్స్ అయ్యామంటే.. ఏ ఊరుకు ఆ ఊర్లనే నర్సరీ, అక్కడే పల్లె ప్రకృతివనం, దానిలో పిల్లలకు ఓపెన్ జిమ్ బ్రహ్మాండంగా ఏర్పాటు చేసుకున్నం. ఇప్పటికే దాదాపు 176 అర్బన్ పార్కులు రూపుదిద్దుకున్నయి. ఇంకా ప్రయత్నాలు చేస్తూనే ఉన్నరు. ఈ విజయం మనందరి విజయం, సమిష్టి విజయం ' అని సీఎం కేసీఆర్ అన్నారు.

# ..నీళ్లుపారిచ్చి తీరుతం



సీఎం కేసీఆర్‌కు జ్ఞాపికను బహూకరిస్తున్న అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

మూడోపేజీ తరువాయి...

నాలుగు నీళ్ల చుక్కలు తెచ్చుకుందామంటే వద్దని ఆపుతరు.. అదీ వాళ్ల రాజకీయమని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు ఎత్తిపోతల రిజర్వాయర్లన్నీ కట్టామని, ఆగస్టులో నింపుకోబోతున్నామని తెలిపారు. 'దాసర్లపల్లి దగ్గర నా మిత్రుడు గణేశ్‌కు పొలం ఉండేది. అక్కడికి రమ్మంటేపోయిన. అక్కడ 10–15 ఎకరాలుంటే ఇరవై బోర్లు వేయాల్సి వచ్చింది. సన్నగ పోస్తే ఆ బోర్లన్నీ ఒక్క కాడికి తెచ్చి కుండీల పెట్టినరు. ఆ బాధలన్నీ వర్ణనాతీతం. తెలంగాణలో ఇలాంటి బాధలన్నీ దాదాపుగా తీరినయి. సబితా ఇంద్రారెడ్డి, మంచిరెడ్డి కిషన్‌రెడ్డి.. వీళ్లకు మించి ఎంపీ రంజిత్‌రెడ్డి.. మాట్లాడితే, కనిపిస్తే మాకు నీళ్లు అంటరు. పాలమూరు ఎత్తిపోతల ఎప్పుడయితది? మాకు నీళ్లు ఎప్పుడొస్తయి? అని పంచాయితీ పెడతరు. మహేశ్వరం, ఇబ్రహీంపట్నం, వికారాబాద్ జిల్లాలోని తాండూరు, పరిగి, వికారాబాద్, చేవెళ్ల నియోజకవర్గాలకు నీళ్లు తెచ్చే బాధ్యత నాది. మీ బిడ్డగా నేను హామీ ఇస్తున్నా. వంద శాతం నీళ్లు తీసుకువస్తా' అని సీఎం తెలిపారు.

### కృష్ణా.. కాకపోతే గోదావరి

రంగారెడ్డి జిల్లాలో కృష్ణాజలాలు సాధ్యం కాకపోతే గోదావరి జలాలను పారిస్తానని సీఎం కేసీఆర్ హామీ ఇచ్చారు. 'హైదరాబాద్‌కు పోయే మంచి నీళ్ల పైపు లైన్ల నుంచి నాకు కొన్ని నీళ్లు ఇప్పిస్తే ఇబ్రహీంపట్నం చెరువు నింపుకుంటమని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి నన్ను బతిమిలాడినరు. రైతు బిడ్డ అయినందున చెరువు ఎండితే చూడలేక బాధపడ్డరు. ఎంత బాధ, ఎంత కరువు ఉంటే ఎమ్మె ల్యే అంత బాధపడతరు. మీరేం చింత చేయొ ద్దు. రాబోయే మూడు, నాలుగు నెలల్లో మా ర్పు చూస్తరు. కాల్వల తవ్వకం కూడా మొదలవుతుంది. టెండర్లు అవుతున్నయి. కృష్ణా నదిలో నీళ్ల కోసం కొంత పంచాయితీ ఉన్నది. కానీ గోదావరిలో ఎలాంటి పంచాయితీ లేదు. కొద్దిరోజుల్లో గోదావరి నీళ్లు గండిపేట, హిమాయత్‌సాగర్‌కు లింకయిపోతున్నయి. అక్కడ చిన్న లిఫ్టు పెట్టినా ఈ ప్రాంతాలకు బ్రహ్మాండంగా నీళ్లు ఇచ్చే అవకాశం ఉంటుంది. కొండపోచమ్మ సాగర్ నుంచి ఘట్‌కేసర్ మీదుగా గోదావరి నీళ్లను మూసీ దాటిస్తే కూడా ఈ ప్రాంతానికి లోయపల్లి దాకా నీళ్లు వస్తయి. అది కూడా పరిశీలన చేస్తున్నరు. ఏదో ఒక విధంగా ఈ ప్రాంతానికి నీళ్లు తెచ్చి ఇస్త అని హామీ ఇస్తున్నా. దాని గురించి ఏమాత్రం చింత అవసరం లేదు' అని కేసీఆర్ భరోసా ఇచ్చారు.

### మనల్ని అవహేళన చేసినవాళ్లు 7వ స్థానంలో..

'మీకు వ్యవసాయం చేయరాదు. అన్నం తినడం కూడా మేమే నేర్పినం' అని తెలంగాణ ఉద్యమ సమయంలో అవహేళన చేసిన వాళ్లు ఈ రోజు 15 లక్షల ఎకరాల్లో వడ్లు పండిస్తే, తెలంగాణ ఏకంగా 56 లక్షల ఎకరాల్లో వడ్లు పండించింది. మనల్ని ఎక్కిరించినోళ్లు వడ్లు పండించటంలో ఏడో స్థానానికి పడిపోతే, తెలంగాణ దేశంలోనే నంబర్ వన్‌గా నిలిచింది. ఎక్కిరించినోళ్లు మన సమీపంలో కూడా లేరు. **-సీఎం కేసీఆర్**

### మూడోసారీ గెలుపు మనదే

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ హ్యాట్రిక్ కొట్టడం ఖాయమని సీఎం కేసీఆర్ ధీమా వ్యక్తం చేశారు. 'మళ్లీ మనమే గెలుస్తున్నం. ఇందులో డౌటే లేదు. వచ్చే టర్మ్‌లో మరింత బ్రహ్మాండంగా అభివృద్ధి పనులు కొనసాగించుకుందాం' అని తెలిపారు. 'ఒక ఇటుక మీద మరో ఇటుక పేర్చినట్టు ఒక్కో సమస్యను అడ్రస్ చేసుకుంటూ పోతున్నం. పేదలను ఆదుకుంటున్నం. గతంలో చరిత్ర కనీవినీ ఎరుగని రీతిలో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నం. మీ ఊర్లల్లనే, మీ కండ్ల ముందే ఇవి జరుగుతున్నయి. ఇటీవల మంచిర్యాల సభలో దివ్యాంగ సోదరులను ఎవరూ ఆదుకోలేదని, వాళ్లకిచ్చే రూ.3,016 పింఛనుకు అదనంగా రూ.వెయ్యి పెంచినం. అట్ల ఎన్నో పథకాలు ప్రతి వాళ్లకు అవసరమయ్యేవి పెట్టుకున్నం. గురుకుల పాఠశాలలు పెట్టి, వాటిని జూనియర్ కాలేజీలు కూడా చేసుకున్నం. ఇవన్నీ ఒక కులానికో, మతానికో సంబంధించినవి కాదు. గొర్రెల పంపిణీ చేసుకుంటున్నం. చేపపిల్లల్ని ఇచ్చి మత్స్యకారులను ఆదుకుంటున్నం. ఎవరినీ వదిలిపెట్టకుండా అందరినీ కడుపులో పెట్టుకొని ఆదుకుంటున్నం' అని కేసీఆర్ వెల్లడించారు.

### తెలంగాణ ప్రజలు నంబర్ వన్

తెలంగాణ అన్ని రంగాల్లో దేశంలోనే నంబర్ వన్‌గా నిలుస్తుందంటే తెలంగాణ ప్రజలు నంబర్ వన్ అని సీఎం అన్నారు. 'ఆర్థిక పరపతిలో, విద్యుత్తు వినియోగంలో, తలసరి ఆదాయంలో, అత్యధిక ధాన్యపు రాసులు పండించడంలో, 24 గంటల విద్యుత్తు సరఫరా, ఇంటింటికీ నల్లాతో మంచినీళ్లు ఇవ్వడం, వంద శాతం ఓడీఎఫ్ సాధించడంలో తెలంగాణ నంబర్ వన్' అని చెప్పారు. ఈ నంబర్ వన్ అంటే తెలంగాణ ప్రజలు అని సీఎం కేసీఆర్ వివరించారు.

## మహేశ్వరం నియోజకవర్గంపై వరాల జల్లు

**ప్రజల** తరపున విద్యాశాఖ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి కోరిన పలు ప్రతిపాదనలపై సీఎం కేసీఆర్ సుముఖత వ్యక్తం చేశారు. ఇంటి ఆడబిడ్డ అడిగినందున ఆ కోరికలు తీర్చవల్సిందేనని అన్నారు. 'నియోజకవర్గానికి మెడికల్ కాలేజీ కావాలన్నారు. ఎక్కడ ఏర్పాటు చేస్తారనేది వాళ్ల ఇష్టం. తప్పకుండా మెడికల్ కాలేజీ మంజూరు చేస్తం. తుమ్మలూరులో చాలావిల్లాలు వచ్చినందున కరెంటు సమస్య వస్తున్నది. సబ్‌స్టేషన్ అవసరమన్నారు. ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా చెప్పారు. కచ్చితంగా మంజూరు చేస్తున్న. మెట్రోను మహేశ్వరం దాకా పొడగించాలని కోరారు. న్యాయమైన కోరిక. మెట్రో విషయంలో ఏ నగరంలో చేయని తప్పు మన రాష్ట్రంలో ఉమ్మడి పాలనలో జరిగింది. విమానాశ్రయానికి కచ్చితంగా మెట్రోను ఏర్పాటు చేస్తరు. కానీ గతంలో ప్రబుద్ధులు పెట్టలేదు. మొన్ననే విమానాశ్రయం వరకు మెట్రో కోసం రూ.6 వేల కోట్లతో టెండర్లు పిలిచారు. శంషాబాద్ వరకు మెట్రో వస్తుంది. అక్కడి నుంచి మహేశ్వరం వరకు తీసుకురావడం చాలా సులభం. బీహెచ్ఈఎల్‌తో పాటు మహేశ్వరం, కందుకూరు వరకు మెట్రో తీసుకువచ్చేందుకు వంద శాతం ప్రయత్నం చేస్తా. తుమ్మలూరుకు రూ.కోటితో కమ్యూనిటీ హాల్ మంజూరు. దానికి దశాబ్ది కమ్యూనిటీ హాల్ అని పేరు పెడితే సార్థకం అవుతుంది. నియోజకవర్గంలోని 65 గ్రామపంచాయతీలకు రూ.15 లక్షల చొప్పున స్పెషల్ ఫండ్. జల్‌పల్లి, తుక్కుగూడ మున్సిపాలిటీలకు రూ.25 కోట్లు, బడంగ్‌పేట, మీర్‌పేట కార్పొరేషన్లకు చెరో రూ.50 కోట్లు మంజూరుచేస్తున్నం' అని సీఎం కేసీఆర్ వెల్లడించారు.

# డిప్యూటీ తహసీల్దార్‌గా నాగలక్ష్మి

- రేంజర్ శ్రీనివాసరావు సతీమణికి నియామక పత్రాలు అందజేసిన సీఎం
- కేసీఆర్‌కు ఐఎఫ్ఎస్ అధికారుల సంఘం కృతజ్ఞతలు




నాగలక్ష్మికి డిప్యూటీ తహసీల్దార్ నియామక పత్రాలు అందజేసి, దీవిస్తున్న సీఎం కేసీఆర్

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): గొత్తికోయల చేతిలో దారుణంగా హత్యకు గురైన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చంద్రుగొండ అటవీశాఖ క్షేత్రాధికారి చలమల శ్రీనివాసరావు సతీమణి నాగలక్ష్మికి ప్రభుత్వం డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం కల్పించింది. ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు చేతుల మీదుగా ఆమెకు సోమవారం నియామక ఉత్తర్వులు అందజేశారు. 2022 నవంబర్‌లో హత్యకు గురైన శ్రీనివాసరావు కుటుంబానికి ప్రభుత్వం అన్నివిధాల అండగా నిలిచింది. రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియాతో పాటు ఖమ్మం జిల్లా కేంద్రంలో 500 గజాల స్థలం ఇచ్చింది. ఈ విధంగా రాష్ట్ర ప్రభుత్వం తోడ్పాటునందించడం అటవీశాఖ చరిత్రలోనే మొదటిసారి. అంతేకాకుండా హరితోత్సవం సందర్భంగా అటవీ స్టేషన్లను ఏర్పాటు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించడం అటవీశాఖ క్షేత్రస్థాయి సిబ్బందికి ఎంతో మనోధైర్యాన్ని కలిగించింది. పెద్దదిక్కును కోల్పోయిన ఆ కుటుంబానికి తానే తండ్రి లాగా, కుటుంబ పెద్దగా నిలిచి వారికి ఇంటి స్థలం, ఆర్థిక సహాయంతోపాటు ఫారెస్ట్ సర్వీస్ రూల్స్‌ని సడలించి డిప్యూటీ తహసీల్దార్ ఉద్యోగం ఇచ్చినందుకు సీఎం కేసీఆర్‌కు ఐఎఫ్ఎస్ ఆఫీసర్స్ అసోసియేషన్–తెలంగాణ చాప్టర్, అటవీశాఖ జూనియర్ ఫారెస్ట్ అధికారుల సంఘం, అటవీశాఖ క్షేత్రాధికారుల సంఘం, రాష్ట్ర అటవీ శాఖ అధికారుల సంఘం, భారత అటవీశాఖ అధికారుల సంఘం నేతలు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు. పెద్దదిక్కును కోల్పోయిన తమకు కుటుంబ పెద్దగా, తండ్రిగా సీఎం కేసీఆర్ అండగా నిలిచారని రేంజర్ శ్రీనివాసరావు భార్య నాగలక్ష్మి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే ఇంటి స్థలం, ఆర్థిక సహాయం అందజేశారని, ఇప్పుడు ప్రభుత్వ ఉద్యోగం కూడా కల్పించారంటూ ధన్యవాదాలు తెలియజేశారు.

## రైతుల ఖాతాల్లోకి 1500 కోట్లు

- ఇప్పటి వరకు 11,444 కోట్లు
- ధాన్యం డబ్బులు జమ: గంగుల

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోలు చేసి ఓపీఎంఎస్‌లో నమోదైన ప్రతి రైతుకు డబ్బులు బదిలీ చేశామని పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ తెలిపారు. సోమవారం ఒక్కరోజే 1500 కోట్లను ఏకమొత్తంగా విడుదల చేసినట్టు చెప్పారు. దీంతో కలుపుకుని ఇప్పటివరకు 11,444 కోట్లను రైతుల ఖాతాలకు బదిలీ చేసినట్టు వివరించారు. సోమవారం వరకు 11.10 లక్షల మంది రైతుల నుంచి 65.82 లక్షల టన్నుల ధాన్యాన్ని సేకరించినట్టు పేర్కొన్నారు. కొనుగోలు ప్రక్రియ దాదాపు ముగిసిందని, 100 సెంటర్లలో మాత్రమే అక్కడక్కడ కొనుగోళ్లు జరుగుతున్నట్టు తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నదనడానికి ధాన్యం సేకరణ నిదర్శనమని పేర్కొన్నారు. ప్రతికూల పరిస్థితుల్లోనూ సీఎం ఆదేశంతో ధాన్యం కొనుగోళ్లు చేపట్టామని వివరించారు.



'నమస్తే తెలంగాణ' కార్టూనిస్ట్ మృత్యుంజయ వేసిన 'హరితహాసం–ట్రీ టూన్స్' కార్టూన్ సంకలనాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు

# పర్యావరణ స్పృహ కలిగించేలా హరితహాసం

**'నమస్తే తెలంగాణ' కార్టూనిస్ట్ మృత్యుంజయ గీసిన కార్టూన్ సంకలనాన్ని ఆవిష్కరించిన సీఎం కేసీఆర్**

హైదరాబాద్, జూన్ 19 (నమస్తే తెలంగాణ): పచ్చదనం పెంపుదల ఆవశ్యకత, పర్యావరణ సమతుల్యత ప్రాముఖ్యాన్ని కండ్లకు కట్టేలా 'నమస్తే తెలంగాణ' కార్టూనిస్ట్ మృత్యుంజయ వేసిన హరితహాసం–ట్రీ టూన్స్ కార్టూన్ల సంకలనాన్ని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు సోమవారం ప్రగతిభవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. గ్రీన్ ఇండియా చాలెంజ్ ఐదేండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సమయోచితంగా, ప్రతీ ఒక్కరికీ మొక్కల పెంపకంపై అవగాహన కలిగేంచేలా హరితహాసం–ట్రీ టూన్స్ కార్టూన్లు ఉన్నాయని, ఒక సామాజిక అంశంపై మూడు వందల కార్టూన్లతో సంకలనం వేయడం అభినందనీయమని ప్రశంసించారు. మృత్యుంజయను ప్రత్యేకంగా అభినందించారు. హరిత తెలంగాణను ప్రతిబింబించేలా ఉన్న కార్టూన్ పెయింటింగ్‌ను ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు మృత్యుంజయ బహూకరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. కేవలం రాజకీయ విషయాలపైనే కాకుండా, సామాజిక అంశాలపై ప్రజలను ఆలోచింపజేసేలా కార్టూనిస్టులు గీసే చిత్రాలు మరింత మందిని ప్రకృతికి దగ్గర చేస్తాయని పేర్కొన్నారు. ఎంపీ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ.. ఒక మొక్కతో ప్రారంభమైన గ్రీన్ ఇండియా చాలెంజ్ నేడు దేశవ్యాప్తంగా లక్షల మందిని చేరడమే కాకుండా కోట్ల మొక్కలు నాటేలా ప్రోత్సహించిందని చెప్పారు. ఉద్యమకాలం నుంచే సోషల్ యాక్టివిస్టుగా ఉన్న మృత్యుంజయ.. ఇప్పుడు గ్రీన్ ఇండియా చాలెంజ్‌ను మరింత ప్రాచుర్యంలోకి తీసుకెళ్తున్నారని ప్రశంసించారు. ఈ కార్టూన్ల సంకలనంతో త్వరలోనే ఎగ్జిబిషన్ ఏర్పాటుచేస్తామని మృత్యుంజయ తెలిపారు.